# నాకు నచ్చిన నా కథ



రావిపల్లి నారాయణరావు

రోజురోజుకి జనాభా సంఖ్య పెరుగుతున్నట్టే కథా పత్రికల సంఖ్య కూడా పెరిగిపోతూ ఉంది. ఎందరో నూతన రచయితలు రచయిత్రులు పరిచయం అవుతున్నారు. ఎన్నో కథలు రాస్తున్నారు. కథలు చదివేది కాలక్షేపానికే అయినా ఇతివృత్తం వాస్తవానికి దూరం కాకూడదని నా అభిప్రాయం. ఆధునిక యుగంలో ప్రపంచం ఎంతో ముందుకుపోయింది. సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంతో ఎత్తుకు పెరిగింది. అయితే నేటి సమాజంలో స్త్రీకున్న స్థానం ఏమిటి?_కొన్ని దశాబ్దాల వెనక ఆమె ఏ పరిస్థితుల్లో ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. కాని మారలేదు. ఒంటరిగా ఉన్న స్త్రీని సుఖంగా బ్రతకనివ్వదీలోకం. అంతటితో ఆగితే ఈ 'రేపు' కేసులు, కోర్టులు, శిక్షలూ ఉండకపోను. "నీడలేని ఆడది" కథ పది సంవత్సరాల క్రిందట అంటే 1-2-74 తేదీ ఆంధ్రజ్యోతి వార పత్రికల్లో ప్రచురించబడింది. నేను యిప్పటికి రాసిన సుమారు యాభై కథల్లో ఈ కథ వాస్తవానికి దగ్గరగా ఉందనిపిస్తోంది. ఇప్పుడు పార్వతిలాంటి స్త్రీమూర్తులు, నిస్సహాయులు మన దేశంలో కోకొల్లలు. అటువంటి వారి జీవితాలకు అద్దంపట్టినట్టుండే, 'నీడలేని ఆడది' కథ నాకు చాలా నచ్చింది.

# నీడలేని ఆడది

ఆఫీసుకు వచ్చినప్పటి నుండి టైపు చేస్తూంది పార్వతి. ఎన్ని పేజీలు టైపు చేసినా నోట్‌బుక్‌లోని పేజీలు తరగడం లేదు. వ్రేళ్ళు నొప్పెడుతున్నాయి. కళ్ళలో సుడులు తిరుగుతున్నాయి. మనస్సులోని దిగులు మరింత ఆమెను కృంగదీస్తూంది.

ఆఫీసు విడిచి ఇంటికి వెళ్ళేలోపున అన్ని కాగితాలు టైపుచేసి ఆఫీసరుగారి టేబుల్‌మీద పెట్టాలని ఆఫీసరుగారి ఆజ్ఞ!

కళ్ళు తుడుచుకుని ధైర్యం తెచ్చుకుని పార్వతి టైపు చేయసాగింది.

పార్వతి సీటు ఆఫీసర్ గదికి పదడుగుల దూరాన ఉంది. ఆమె ఉన్న హాల్లోనే అకౌంట్సు సెక్షన్, డిస్పాచ్ సెక్షన్ ఉన్నాయి. గుమాస్తా బృందం పార్వతిని బ్రతకనివ్వడంలేదు. ఆ బృందం ఆమెకు పెట్టిన మారు పేరు పంప్కిన్. ఆమె ఆ హాల్లో అటు ఇటు వెళ్ళేటప్పుడు ఆ పేరుతో పిలుస్తారు. పిల్లికూతలు కూస్తారు. కుక్కల్లా మొరుగుతారు. పార్వతి వాటిని లెక్క చేయదు. కాని అప్పుడప్పుడు వారుచేసే విమర్శలకు మాత్రం ఆమె మనస్సు చివుక్కుమంటుంది.

పార్వతి వయస్సు ముప్పైయైదు దాటినా, పాతిక సంవత్సరాలు నిండని యువతిలా కనబడుతుంది. పచ్చని ఛాయ, గుండ్రని మొహం, మెలికలు తిరిగే నల్లని కురులు ఆమె అందానికి మరింత మెరుగుపెట్టాయి. ఆమె కళ్ళల్లో తెలియని ఆకర్షణ ఉందని గుమాస్తాబృందం అభిప్రాయం. నిజానికి ఆమెకు పెళ్ళికావలసిన కూతురు ఉందంటే ఎవరూ నమ్మరు.

పెద్దకూతురు ప్రమీల చేసినపని తల్చుకున్నప్పుడు పార్వతిగుండె చెరువైపోతుంది. మనసులోని బాధను ఆమె ఎవరితోనూ చెప్పదు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది మరి! ఆమె భర్తను తల్చుకుని కన్నీరుపెట్టని రోజు ఉండదు. అతనే వుంటే తనకు ఈ కష్టాలు ఉండేవా? తనకి, ముగ్గురు కుమార్తెలను దిక్కులేనివారిగా చేసి భర్త కన్నుమూయడంతో సంసార బాధ్యత తలపైపడింది.

పార్వతి టైపుచేస్తూంది. ఎంత తొందరగా కొట్టాలన్నా ఎందుకో వ్రేళ్లు త్వరగా పోవడంలేదు. షార్ట్‌హ్యాండులో తీసుకున్న డిక్టేషన్ గజిబిజిగా కనబడుతోంది. కళ్ళలో పేరుకున్న నీటిని తుడిచి పార్వతి జాగ్రత్తగా టైపు చేస్తూంది.

"అమ్మా! అయ్యగారి కలవాలోంది." బంట్రోతు అప్పలస్వామి చేతులు నలుపుకుంటూ వచ్చాడు.

ఆఫీసరు వొకడు—తను పని చేయడు, ఇతరులను పని చెయ్యనివ్వడు. గంటకు పదిసార్లు పిలిస్తే 'పని ఎలా జరుగుతుంది?— అన్నీ తొందరగా కావాలంటాడు మళ్ళీ.... డిక్టేషనిస్తాడు కాబోలు.

పార్వతి నోటుబుక్కు, పెన్సిలు తీసుకుని ఆఫీసరు ఛాంబర్సు వైపు నడిచింది.

పార్వతి కుర్చీనుండి లేవగానే హాల్లో పిల్లి అరుపులు, కుక్క అరుపులు వినిపించాయి.

"అయ్యగారు పిలిచినట్టున్నారు" అన్నాడు ఓ గుమాస్తా.

"అమ్మగారు వెళ్తున్నారు." అన్నాడు మరో గుమాస్తా.

"పంప్కిన్‌లో నూతన కళ గోచరిస్తూంది." వెకిలి నవ్వు.

"వళ్ళు కూడా పెంచుతూంది సీనియర్ గుమస్తా ఏమో."

"నీళ్ళు బాగా పడినట్టున్నాయి" డిస్పాచ్ సెక్షన్‌లో ఒక గొంతు.

"ఏ నీళ్ళు - బావి నీళ్ళా? - ఆఫీసు నీళ్ళా?"

మొదటి గుమాస్తా ప్రశ్నకు ఒంటా పకాలున నవ్వారు.

కోతిమూక గొల్లుమనగానే పార్వతి వెనక్కి తిరిగి ఎర్రగా చూసింది.

ఛీ—వీళ్ళు మనుషులు కారు. లేకపోతే వీళ్ళ వయస్సెంత?—తన వయస్సెంత? ఆడది కనబడగానే వాళ్ళిష్టం వచ్చినట్లు కూతలు కూయడమే. మంచి చెడ్డా అక్కర్లా—ముగ్గురు పిల్లల తల్లి, ముప్పైయైదు సంవత్సరాలు నిండిన తనతో పరిహాసాలా? తనకు కాకపోయినా తన వయసుకైనా గౌరవం ఇయక్కర్లా? తననే యిన్ని విధాల అల్లరిచేస్తుంటే, అప్పుడే కాలేజీ చదువు ముగించి ఆఫీసుల్లో చేరే అమ్మాయిలను ఈ కోతిమూక సుఖంగా బ్రతకనిస్తారా! భగవాన్! వీళ్ళ మధ్య జీవించడమే దుర్లభంగా ఉంది.

పార్వతి ఆఫీసరు దగ్గర డిక్టేషన్ తీసుకుని మళ్ళీ వచ్చి తన సీట్లో కూర్చుంది. కోతిమూక చెవులు కొరుక్కుంటున్నారు.

పార్వతికి వారి మాటలు స్పష్టంగా వినబడలేదు. వినాలన్న కోరిక కూడా వారికి లేదు.

ఏమిటో ఈ రోజు మనసు బాగులేదు. ప్రమీల ఎలా వుందో? – తను ప్రమీలపట్ల కఠినంగా ప్రవర్తించిందా?–ప్రవర్తించినా తప్పులేదు. ఆమె ను కనికరించకూడదు. ప్రమీల తన కడుపున తప్పు పుట్టింది–. లేకపోతే అటువంటి పని చేస్తుందా?–

తండ్రిలేని పిల్లలని అల్లారుముద్దుగా పెంచిందే....ప్రమీలకు పి.యు.సి. చెప్పించింది. ఉద్యోగానికి వెళతానంటే సరేనంది. తండ్రిలేని లోటు పిల్లలకు కలగనివ్వలేదు. అలా సంసారాన్ని నెట్టుకొస్తున్నా, తల్లి ఒకతి తనకు ఉందని ఆలోచించకుండా ప్రమీల ఆ బ్యాంకు ఏజెంట్తో లేచిపోతుందా?!–ఛ–ఎంత అప్రతిష్ట....వంశానికి కళంకం తెచ్చే పిల్లలు బ్రతికివుంటే మాత్రం ఏం లాభం?

బ్యాంకు ఏజెంటుని ప్రేమించవద్దని పార్వతి ఎప్పుడూ చెప్పలేదు. తన కులం, గోత్రం వేరేనని ఆక్షేపించలేదు....వర్ణాంతర వివాహాలు తనేకాదు తన భర్త కూడా ప్రోత్సహించేవారు. అటువంటప్పుడు–'అమ్మా! నేను ఆ బ్యాంకు ఏజంటును పెళ్ళిచేసుకుంటాను'– అని ఆ ప్రమీల వచ్చి ఆశీర్వదించమంటే తను అభ్యంతరం చెబుతుందా?–

పెళ్ళిపెడాకులు కాకుండా తన కూతురు తల్లి కాబోతుందంటే ఏ కన్న తల్లి సహిస్తుంది! తల్లే కాదు, స్త్రీజాతే సహించదు. అలాంటి ప్రమీలను తను కనికరించాలా? ఛ....ఇటుపై ప్రమీల తన కూతురు కాదు. ఆ కూతురు తన యిల్లు విడిచి పెట్టినప్పుడే చచ్చిపోయింది....

పార్వతి నిట్టూర్చింది.

సరే–ఏదో ఆవేశంలో తను ఇంటినుండి పొమ్మంది. ఆ పాకుతో, తల్లి–ఇద్దరు చెల్లెళ్ళు ఎలా జీవిస్తారన్న ఆలోచన లేకుండా ఆ బ్యాంకుఏజెంటుతో లేచిపోవడమే!....

కూతురి బ్రతుకు తలుచుకుంటే కడుపు తరుక్కుపోతోంది. పార్వతి కళ్ళు తుడుచుకుని టైపు చేయసాగింది.

కోతిమూక కబుర్లలోకి దిగారు.

"ఒరే రావూ! ఇది విన్నావా?-పంప్కిన్ పెద్ద కూతురు ఎవరితోనో లేచిపోయిందట!"

'ఎవరూ?-ఆ పెద్దమ్మాయి ప్రమీలా?'

'అమ్మగారి పెంపకంలో అంతా అంతేనేమో!'

అంతా ఫకాలున నవ్వారు.

ఈ గుమాస్తాలు ఎందుకు తనని చులకనగా చూస్తారు?

ఛీ....లోకంలో ఆడదానిగా పుట్టకూడదు. కాలం మారినా మనుషులు మారడంలేదు.— "ఆడదాని చూడ, అర్థంబు చూడ బ్రహ్మకైన పుట్టు రిమ్మతెగులు."-అని ఊరకే అన్నారా?!

గోడగడియారం అయిదు కొట్టింది. గుమాస్తాలు ఒక్కొక్కరు బయటకు జారుకుంటున్నారు.

పార్వతి పని పూర్తికాలేదు. ఇంకా మూడుపేజీల మేటరు కొట్టవలసి ఉంది. యింకో అరగంటయినా పట్టేటట్టుంది.


అయ్యగారి బంట్రోతు అప్పలస్వామి కూడా ఈ రోజు దవాలు యూనిఫారం యింత తొందరగా తీసేస్తున్నాడే.... వీడు కూడా తొందరగా వెళతాడా ఏమిటి?

అంతా నిశ్శబ్దంగా వుంది. గోడ గడియారం, తన సైపు మిషను టిక్కుటిక్కు మంటున్నాయి.

"అమ్మా నేను వెళుతున్నాను. ఆఫీసర్‌గారి భార్యను సినిమాకు తీసుకెళ్ళాలట? సైపుకొట్టి మీరు పంపిన కాగితాల్లో తప్పులు ఎక్కువ వున్నాయట....తాపీగా తప్పులు లేకుండా సైపుచేయమని అయ్యగారి శలవు. ఆ కాగితాలు ఈరోజే ఢిల్లీ వెళ్ళిపోవాలట. అయ్యగారు గదిలోనే ఉన్నారు. మరి నేను వెళ్తాను.' అప్పలస్వామి సంచి పట్టుకుని గబగబ క్రిందకు నడిచాడు.

అవును ఇవాళ తను తప్పులు ఎక్కువే కొట్టింది. మనసు తన స్వాధీనంలో లేదు.

తను ఒక టెంపరరీ సైనో-కమ్-టైపిస్టు! టెంపరరీ ఉద్యోగస్తులు పొరపాట్లు చేయకూడదు. ఏదో ఒక సాకుతో టెంపరరీ ఉద్యోగస్తులను ఇంటికి పంపివేయవచ్చు.




పార్వతి టైపు చేస్తోంది....

చిన్నది స్కూలు నుండి ఇంటికి వచ్చి ఉంటుంది. రెండోది స్కూలు నుండి టైపు క్లాసుకు వెళ్ళికాని రాదు. టైం అయిదుంబావు. పాపం చిన్నదానికి కాఫీ ఎవరిస్తారు? ఇదివరకు ప్రమీల బ్యాంకు నుండి నాలుగున్నరకే వచ్చి ఇంట్లో ఉండేది. చిన్నది ఏడిస్తే సముదాయించేది. ఆ చిన్నపిల్ల ఈ రోజు తను యింటికి వెళ్ళేవరకు వరండాలో ఏడుస్తూ కూర్చుంటుందేమో!

ఏమిటీ ఆలోచనలు?—తన పని ఈ రోజు తొందరగా జరగడంలేదు.

ఇక తను దేనిగురించీ ఆలోచించకూడదు తన కూతురు ఆ ఏజెంటుతో లేచిపోతే పోనీ....ఎవరు ఎలా పోతేనేం....తను ఈ లోకంలో బ్రతకలేదా ఏం? పైనున్న అతను చల్లగా చూస్తాడు....ఆ పైన భగవంతుడు లేడా ఏం?....

ఇంకో పేజీ వుంది. అదికూడా టైపుచేసేస్తే ఈ రోజు పని పూర్తిఅయినట్టు. ఇంకో పదినిముషాల్లో కాగితాలన్నీ ఆఫీసరు టేబుల్‌మీద పెట్టిపోవచ్చు.

ఆఫీసు అయిదు గంటలకే విడిచిపెడితే బజారుమీదుగా వెళ్ళాలనుకుంది తను. చిన్నదానికి గౌను కొనాలి. రెండోదానికి స్కర్టు కుట్టించాలి. తండ్రిలేని పిల్లలు....ఆ లోటు వారికి తెలియకూడదు.

గోడగడియారం వైపు చూపింది పార్వతి. టైం అయిదున్నరైంది. చివరి పేజీ టైపుచేయడం పూర్తయింది.

మొహం తుడుచుకుంది. చీర సర్దుకుంది. కాగితాలు పట్టుకుని తన ఆఫీసర్ గదిలోకెళ్ళింది.

ఆఫీసర్ ఏదో మాగజైన్ చదువుతున్నాడు.

కాగితాలు టేబుల్‌మీద పెట్టింది పార్వతి.

ఆఫీసర్ మాగజైన్ ప్రక్కనపెట్టి పార్వతివైపు చూశాడు.

"అన్నీ పూర్తిగా టైపు అయినట్టేనా?" అధికారం కొట్టవచ్చినట్టు కనబడింది అతని మాటల్లో.

"అంతా పూర్తిగా టైపు చేశాను సార్." చెప్పింది పార్వతి.

"వెరీగుడ్ – ఈ రోజు టపాలోనే ఆ కాగితాలు ఢిల్లీ పోవలసిఉంది."

"నేనిక ఇంటికి వెళతాను." తల దించుకుని చెప్పింది పార్వతి.

"వెళ్దువుగాని కూచో–" ఆఫీసర్ తన ముందున్న కుర్చీ చూపించాడు.

ఆమె సంశయించింది.

"ఫర్వాలేదు పార్వతీ! కూచో" అతను మళ్ళీ అన్నాడు. పార్వతి కుర్చీలో కూర్చుంది.

ఆఫీసర్ వయస్సు యాభై దాటింది. అతను నల్లగా ఉన్నాడు. ఎర్రగా ఉన్న పార్వతి మొహంలోకి చూడసాగాడు.

ఆఫీసర్ తలమీద వెంట్రుకలు లేవు. మెలికలు తిరిగిన పార్వతి కురులు అతన్ని ఆకర్షించాయి. ఆఫీసర్ టెలిగ్రాఫ్ స్తంభంలా సన్నగా పొడుగ్గా వున్నాడు. పార్వతి పంప్కిన్‌లా కనబడింది. చక్రాల్లాంటి ఆమె కళ్ళు కనురెప్ప వేయకుండా చూశాడు ఆఫీసరు.

ఫాన్ గిరగిరా తిరుగుతున్నా చిరుచెమట్లు పోసింది ఆఫీసర్ శరీరం

"పార్వతీ!"

ఆ పిలుపులో అధికారం కనబడలేదు.

పార్వతి తలెత్తింది.

"ఈ ఆఫీసులో నువ్వు చేరినప్పటినుండి నిన్ను చూస్తున్నాను. ఎన్నాళ్ళనుండో నీతో మాట్లాడాలనుకుంటున్నాను. కాని ధైర్యం లేకపోయింది. నీతో

సరదాగా మాట్లాడడానికే కాగితాలన్నీ ఈ రోజు పైపు చెయ్యాలన్నాను!" ఆఫీసర్ నవ్వాడు.

ఆఫీసర్ ఉద్దేశ్యం గ్రహించింది పార్వతి.

పైటను శరీరంనిండా కప్పుకుంది.

"క్షమించండి – నేను వెళతాను." ఆమె లేచి నిలబడింది.

ఆఫీసర్ నవ్వుతూ లేచి తలుపుదగ్గర నిలబడ్డాడు.

"చూడు పార్వతీ!– ఈ విషయం మూడో మనిషికి తెలియనివ్వను. అందుకే అందర్నీ పంపిచేశాను. నన్ను కాదనకు. నీకు ప్రమోషన్ యిస్తాను." అన్నాడు ఆఫీసర్.

"మీరు ఆఫీసర్.... నేను టెంపరరీ ఉద్యోగిని. నన్ను ఇలాగే బ్రతక నివ్వండి. నాకు ప్రమోషన్ అదీ అక్కర్లేదు. నాకు ముగ్గురు పిల్లలు. మీకీ దుర్బుద్ధి పుట్టడం నా దురదృష్టం. దయచేసి నన్ను పోనివ్వండి." ప్రాధేయ పడింది పార్వతి.

ఆఫీసర్ ఆమె చేయి పట్టుకున్నాడు.

"పార్వతీ!" అతను ఆమెను దగ్గరకు తీసుకోటానికి ప్రయత్నించాడు. పార్వతి పెనుగులాడింది.

ఆఫీసర్ అని ఊరుకుంటే లాభంలేదు. తన వంశమర్యాదలు కాపాడాలి. తన భర్త పేరుప్రతిష్టలు నిలుపుకోవాలి. లేకపోతే తనకి, తన కూతురు ప్రమీలకు తేడా ఏముంది?

'ప్రమీల చిన్నపిల్ల –వయసులో వుంది. తెలిసో తెలీకో తన బ్యాంకు ఏజెంటు వలలో పడిపోయింది' సమర్థిస్తుంది లోకం.

తనే ఇటువంటి రొంపలోకి దిగితే–లోకులమాట అటుండనీ–తన భర్త క్షమిస్తాడా? ఆ పైనున్న భగవంతుడు మాత్రం శిక్షించడూ!! పార్వతి, ఆఫీసర్ చేయి పళ్ళతో కొరికి అక్కడ నుండి తప్పించుకుంది. ఆఫీసు విడిచి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడిచింది పార్వతి. అప్పటికే చీకటి పడింది. రోడ్డుమీద లైట్లు మసక మసకగా వెలుగుతున్నాయి.

పార్వతి కళ్ళల్లో వెలుగులేదు.

ఏమిటీ అన్యాయం? ఎవరూ తనను హాయిగా బ్రతకనివ్వడంలేదు, గుమాస్తాలు ఏదో తెలివితక్కువ గా అల్లరిచేస్తున్నారని, ఎప్పుడో ఒకప్పుడు

ఆఫీసర్‌తో ఆ విషయం చెప్పి వారి ఆటలను కట్టించాలని తలచింది తను. కాని ఆఫీసరే కోతిమూక నాయకుడౌతాడని తను కలలోకూడా అనుకోలేదు. అటువంటి ఆఫీసరుకు, గుమాస్తాలకు తేడా ఏవిటి?—పెద్ద ఉద్యోగస్థుడనని విర్రవీగిపోవడం గొప్పకాదు. ఉద్యోగం చిన్నదైనప్పటికి, మంచి సంస్కారంగల వ్యక్తి అని నలుగురిచేత అనిపించుకోడంలోనే ఉంది మనిషి విలువ. ఉద్యోగస్థులు విజ్ఞానవంతులు స్త్రీ పట్ల ఇంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తారని ఆమె ఊహించ లేదు. అతనే బ్రతికుంటే తను ఉద్యోగంలో ప్రవేశించేదా?-తనకి, తన పిల్లలకి గతి పట్టేదా?-

పార్వతి ఇల్లు చేరేసరికి ఇద్దరు పిల్లలు ఆమె రాకకోసం ఎదురుచూస్తూ వరండాలో కూర్చున్నారు.

* * * *


ఆ మరుచటి దినం తొమ్మిది గంటలకు ఇద్దరు పిల్లల్ని స్కూలుకు పంపి, ఆఫీసుకు బయల్దేరింది పార్వతి.

ఆఫీసుకు వెళ్తుందన్నమాటేగాని ఆమె మనసు మనసులో లేదు. గడిచిన రోజు సంఘటన ఆమె కళ్ళముందు మెదిలింది. ఆఫీసరు ఎంత క్రూరంగా ప్రవర్తించాడు!—పయోముఖ విషకుంభం! తను ఆఫీసర్ ఆటలు సాగనివ్వలేదు. తగిన బుద్ధి చెప్పడమే మంచిదైంది. ఇప్పుడు తను ఆఫీసర్‌కు తన మొహం చూపించగలదా?—తనేం తప్పు చేసింది?—తనవని చేసుకుపోతే ఆఫీసర్ ఏం చేయగలడు?

రోడ్డుమీద బస్సు రడీగా ఉంది. పార్వతి బస్సులో కూర్చుంది. పది నిముషాల్లో ఆమె ఆఫీసుకు చేరుకుంది.

ఆఫీసు హాల్లో అడుగుపెట్టి తన సీటువైపు దారితీసింది పార్వతి. ఆ రోజు కోతిమూక కూతలు, అరుపులు వినబడలేదు. గుమాస్తాలు పనిలో మునిగిపోయారు. చిత్రంగా ఉంది! పార్వతి తన సీట్లో కూర్చోడం అప్పల స్వామి చూశాడు. కాని యిదివరకటిలా -'దండాలమ్మగారూ!'-అని చేతులు జోడించి నవ్వలేదు. ఆముదం తాగినట్టు అక్కడ స్టూలుమీద కూర్చున్నాడేం ఈ రోజు?

ఏవిటో ఆఫీసు వాతావరణం మారిపోయింది. పార్వతి టిఫిన్‌బాక్సు




క్రింద అరలో పెట్టి, టేబుల్ మీదున్న టైపుమిషన్ వైపు దృష్టి మరల్చింది.

ఎక్కడనుండొచ్చింది చెప్మా కవరు?

ఇంటి అడ్రసుకేగాని ఆఫీసు అడ్రసుకు ఉత్తరాలు రావే....

టేబుల్ మీదున్న కవరు తీసి ఆతృతగా చూసింది పార్వతి.

అది ఉత్తరం కాదు. ఆఫీసు ఆర్డర్। ఆమెకు తెలియకుండానే ఆమె కళ్ళనుండి నీళ్ళు జలజలా రాలాయి. తన ఉద్యోగం వెంటనే పోతుందని ఊహించి వుంటే ఆమె అంతగా బాధపడేది కాదేమో। ఎంత టెంపరరీ ఉద్యోగం అయినా ఒకటి రెండు తప్పులు టైపు చేసిందని ఉద్యోగం నుండి తొలగించడమే। దాని వెనుకవున్న కారణం ఆమెకు తెలుసు; ఆఫీసరుకు తెలుసు. కాని లోకానికి తెలీదుగా।

ఇప్పుడు తను ఎలా జీవించాలి? పిల్లల్ని ఎలా పోషించాలి? భగవంతుడు ఎందుకు తననిలా బాధపెడుతున్నాడు?

క్రింద అరలో పెట్టిన టిఫిన్‌బాక్సు తీసుకుని పార్వతి లేచింది. ఆ రోజు వరకు రావలసిన నూట యిరవై రూపాయల జీతం కాషియర్ తీసుకువచ్చి పార్వతికి అందజేశాడు.

పార్వతి తల దించుకుని ఆఫీసునుండి బయటకు వెళ్తుంటే కోతిమూక

కళ్ళల్లోకూడా నీళ్ళు నిలిచాయి. పార్వతి బస్సు ఎక్కలేదు. బజారుగుండా నడిచింది. చేతిలో నూటఇరవై రూపాయలు. అవి ఎన్నాళ్ళు సరిపోతాయి? తనకు మళ్ళీ ఉద్యోగం ఎవరిస్తారు?-వయసు మించిపోయింది. ఉద్యోగం దొరికినా అక్కడ మాత్రం ఇటువంటి గుమాస్తాలు, ఆఫీసర్లు ఎందుకుండరు?- చిన్న ఆఫీసర్ చెప్పినట్టు తను అతని చేతిలో కీలుబొమ్మయి ఉంటే ఈ సరికి ప్రమోషన్ ఆర్డరు టేబుల్‌మీద ఉండేది! నీడలేని ఆడది ఈ లోకంలో సుఖంగా జీవించలేదు.

బజార్లో ఏదో కంపెనీ పదిరూపాయలకే కుట్టుమిషన్ ఇస్తుందట—అడ్వర్‌టైజ్‌మెంట్ కాగితం చూసింది పార్వతి. వెంటనే ఆ కంపెనీకి వెళ్ళి పార్వతి కుట్టుమిషన్ తీసుకుంది. పది రూపాయలు వెంటనే చెల్లించింది మిగతాది వాయిదాల మీద చెల్లించవచ్చునట!

* * * *

టైపు మిషనుపోయి కుట్టుమిషన్ వచ్చినందుకు, స్వతంత్రంగా బ్రతక గలిగే అవకాశం ఏర్పడినందుకు పార్వతి సంతోషించింది. కానీ ఆ వీధిలో ఒక టైలర్ ఉందన్న సంగతి అందరికి తెలిసేవరకు తనకు బట్టలు ఎవరిస్తారు? అంతవరకు తను ఎలా జీవిస్తుంది?

పార్వతి మిషన్‌మీద తలపెట్టి కన్నీరు కారుస్తూ కూర్చుంది

రెండో కూతురు ఆ రోజు స్కూలునుండి తొందరగా వచ్చింది. సంచి, పుస్తకాలు గదిలో పడేసి తల్లి దగ్గరకు వచ్చి ఆమె చెప్పింది—

“అమ్మా! మరేమో రోడ్డుమీద అక్క కనబడింది. మరేమో అక్క చెప్పిందీ - ఆ బ్యాంకులో తనకు ప్రమోషన్ దొరికిందట జీతం చాలా ఎక్కువ యిస్తారట!”

తను చెప్పినది విని తల్లి చాలా సంతోషిస్తుందని తలచింది ఆ చిన్నపిల్ల. కాని పార్వతి మొహంలో సంతోషం కనబడలేదు. ఆమె ఉద్యోగం పోయి నందుకు విచారించనూ లేదు. కొన్ని క్షణాలు ఆమె స్థాణువులా ఉండిపోయింది.

